రైతులకు అండ.. బీఆర్ఎస్ జెండా

- కాంగ్రెస్ వైఖరితోనే కర్షకులకు కష్టాలు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు
- జిల్లావ్యాప్తంగా రైతుదీక్షలకు భారీ స్పందన

పాలేరు నియోజకవర్గ స్థాయి రైతుదీక్షలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

వైరాలో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, దీక్షలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 6: రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందని, కాంగ్రెస్ సర్కారు మాత్రం కష్టాలపాలు చేస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద శనివారం బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ స్థాయి రైతుదీక్ష కార్యక్రమం పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది. ఖమ్మంరూరల్, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్యఅతిథి తాతా మధు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నరకం చూపిస్తున్నదని విమర్శించారు. సాగర్, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా కూడా వదలలేదన్నారు. చివరకు కేసీఆర్ ప్రజల్లోకి వచ్చేసరికి బెదిరిపోయి నీళ్లు విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నదని అన్నారు. అధికారంలోకి రాగానే రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి, అప్పులు తీసుకోని రైతులను రెచ్చగొట్టి పంట రుణాలు తీసుకునేలా చేసిన రేవంత్ రెడ్డి.. గద్దెనెక్కాక అదే రైతులను డిఫాల్టర్లుగా చేస్తున్నారని మండిపడ్డారు.బీఆర్ఎస్‌కు ఉద్యమాలు, కేసులు, జైళ్లు కొత్తేమీ కాదన్నారు. ప్రజలు, రైతుల కోసం ఎలాంటి వేధింపులు, కేసులనైనా ఎదుర్కోవాడనికి సిద్ధంగా ఉండాలని, ఉద్యమాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, రూరల్ ఎంపీపీ బెల్లం ఉమ, జడ్పీటీసీ సభ్యుడు యండపల్లి వరప్రసాద్, నేలకొండపల్లి, కూసుమంచి మండలాల పార్టీ అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య, సుడా మాజీ డైరెక్టర్ గూడ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భరోసా కేసీఆర్..

అన్నదాతలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి

రైతుభరోసా దీక్షలో నామా, వద్దిరాజు, సండ్ర

సత్తుపల్లి, ఏప్రిల్ 6: రాష్ట్రంలో ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు భరోసాగా నిలుస్తున్నారని ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపుమేరకు రైతులకు అండగా నిలిచేందుకు శనివారం కల్లూరులో చేపట్టిన రైతుభరోసా దీక్షలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ మాత్రమే రైతుల పక్షాన నిలబడి ఉందని, పార్లమెంట్‌లో తెలంగాణ వాణి బలంగా ఉండాలంటే బీఆర్ఎస్ ఎంపీలు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ ముందుచూపుతో చెరువులు, కుంటలు నింపి రైతులకు సాగు, తాగునీరు అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరంపై లేనిపోని అబాండాలు వేసి అవినీతి జరిగిందంటూ ప్రచారం చేస్తున్నారని, పార్లమెంట్‌లో కాళేశ్వరంపై అడిగిన ప్రశ్నలకు కేంద్రమే స్వయంగా అవినీతి జరగలేదని, రూ.80 వేల కోట్ల వరకు ఖర్చుచేస్తున్నారని, దీనిద్వారా రైతులకు సాగు, తాగునీరు అందిస్తున్నారని జవాబు చెప్పిందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడం ఒక చరిత్ర అన్నారు. రైతుల పొలాలకు ఎకరానికి రూ.20వేల చొప్పున పరిహారం అందించాలని, రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

హామీలు ఏమయ్యాయి : ఎంపీ వద్దిరాజు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామంటూ గొప్పలు చెప్పిన నాయకులు వంద రోజులైనా హామీలు ఏమయ్యాయని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రశ్నించారు. పంటనష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేసీఆర్ కరీంనగర్, జనగామ జిల్లాల్లో పర్యటిస్తూ రైతులకు అండగా నిలబడేందుకు ముందుకు సాగుతున్నారన్నారు. రైతులను మేల్కొడమే లక్ష్యమని, ప్రభుత్వం వెంటపడి ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు పోరాడుతామన్నారు. రానున్న ఎన్నికల్లో నామాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

కాంగ్రెస్‌కు రైతులపై చిత్తశుద్ధి లేదు : సండ్ర

మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేదని, రైతులను కరువుతో అల్లాడేలా చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అయినప్పటికీ ముందుచూపు లేకపోవడంతో నీళ్లు లేక పంటలన్నీ ఎండిపోతున్నాయన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో నీళ్లు లేక పంటలు వేయలేని పరిస్థితి రైతులకు నెలకొన్నదన్నారు. కాంగ్రెస్ సర్కార్‌ను మేల్కొల్పడానికే రైతుభరోసాను చేపట్టామని, ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, నాయకులు పాలెపు రామారావు, దొడ్డా శ్రీనివాసరావు, వెంకట్‌లాల్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, కూసంపూడి మహేష్, గొర్ల సంజీవ రెడ్డి, వేంసూరు ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, దొడ్డా శంకర్‌రావులతో పాటు వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అసమర్థ కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పాలి

నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు

వైరా టౌన్, ఏప్రిల్ 6: అసమర్థ కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు అడుగడుగునా అవమానాలు పాలవుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. వైరాలో శనివారం రైతు భరోసా దీక్షలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయం సుభిక్షంగా సాగిందని, అన్నదాతలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఈ పరిస్థితి తారుమారైందని చెప్పారు. సాగు నీరు అందక పంటలు ఎండుతున్నాయని, అప్పులు తీరే మార్గం కనిపించడం లేదని, ప్రభుత్వం ఆదుకోకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ ఈ దుస్థితి లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని రైతులను కోరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. రైతుల పక్షాన పార్లమెంటులో గొంతు విప్పిన రైతు బిడ్డ నామా నాగేశ్వరరావును మరోసారి గెలిపించాలని కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ మదన్‌లాల్ మాట్లాడుతూ.. ఇప్పుడున్న పరిస్థితుల్లో నామా గెలుపు అనివార్యమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, నాయకులు వనమా విశ్వేశ్వరరావు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిర, ఏప్రిల్ 6: రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిల్లాపరిషత్ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజు డిమాండ్ చేశారు. మధిరలోని పాత రూరల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా శనివారం రైతు గోస నిరసన దీక్ష కార్యక్రమం లింగాల కమల్‌రాజు అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులు సుభిక్షంగా ఉన్నారని అన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే సాగు నీరు, నిరంతరాయంగా కరెంట్, తాగు నీరు ఇవ్వలేకపోతున్నదని విమర్శించారు. ఇలాంటి చేతగాని దద్దమ్మ సర్కారును తెచ్చుకున్నందుకు ప్రజలు కుమిలిపోతున్నారని అన్నారు. రైతు బంధు ఇవ్వాలని, రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఉద్యమాలతో గుణపాఠం చెబుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపోతుల వెంకటేశ్వర్లు, కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, బోనకల్లు మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

రఘునాథపాలెం, ఏప్రిల్ 6: ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అన్ని విధాలా నష్టపోయిన అన్నదాతలను తక్షణమే ఆదుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. రఘునాథపాలెం మండల నేతలు మంచుకొండ ప్రధాన సెంటర్‌లో శనివారం నిరసన దీక్ష నిర్వహించారు. మండల అధ్యక్షుడు అజ్మీరా వీరూనాయక్ మాట్లాడుతూ.. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మోసాల కాంగ్రెస్‌కు ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు భూక్యా లక్ష్మణ్‌నాయక్, తేజావత్ రాణి, కుర్రా భాస్కర్‌రావు, కాపా భూచక్రం, పెంట్యా, ధరావత్ మోహన్, మంద విజయ్, బానోతు రవి, లక్మా హుస్సేన్, ఆంగోతు బాబు, లాలు, వాంకుడోతు భిక్షం, చిట్టెం నర్సింహారావు పాల్గొన్నారు.

మధిర నిరసన దీక్షలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

రఘునాథపాలెం: మంచుకొండలో నిరసన దీక్షలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు

ఖమ్మంలో 'వండర్ కిడ్స్' వార్షికోత్సవం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పాఠశాల నిర్వాహకులు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6: నగరంలోని వండర్ కిడ్స్ ఉన్నత పాఠశాల 24వ వార్షికోత్సవాన్ని ఖమ్మం వర్తక సంఘ భవనంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫెమా కన్వీనర్ మువ్వా శ్రీనివాస్, సీఏ రమేశ్ మాట్లాడుతూ.. 24 ఏళ్లుగా సాధారణ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తుండడం అభినందనీయమని అన్నారు. 40 మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం గర్వకారణమన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కొండపల్లి శశిధర్‌రెడ్డి, ట్రస్మా అధ్యక్షుడు కాంతారావు, నరసింహారెడ్డి, రామచంద్రరావు, పైడిమర్ల అశోక్‌రెడ్డి, శ్రీకాంత్, సూరిబాబు, రమాజ్యోతి, పూర్ణబిందు, రమేశ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను వినియోగించుకొని రాణించాలి

'శ్రీచైతన్య' వార్షికోత్సవంలో వ్యక్తిత్వ వికాస నిపుణుడు రాఘవేంద్ర

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆకెళ్ల రాఘవేంద్ర, మల్లెంపాటి శ్రీధర్, శ్రీవిద్య

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6: విద్యార్థులు ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకొని తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్ర సూచించారు. ఖమ్మంలోని శ్రీచైతన్య గ్లోబల్ విస్టా పాఠశాలలో శ్రీచైతన్య గ్రూప్ ఆఫ్ స్కూల్స్ 15వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. మల్లెంపాటి శ్రీధర్ వంటి ఉత్సాహవంతులైన విద్యావేత్తలు విద్యార్థుల్లో జాతీయ భావాన్ని, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు చేస్తున్న కృషిని అభినందనీయమైనదని అన్నారు. 2008లో కేవలం 135 మందితో ఒకే క్యాంపస్‌తో ప్రారంభమైన ఈ పాఠశాల.. నేడు ఎన్నో శాఖలుగా విస్తరించిందని వివరించారు 2024-25 విద్యాసంవత్సరంలో ఆరు ఎకరాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీచైతన్య గ్లోబల్ విస్టా స్కూల్ అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకున్నదని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డైరక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ సాయిగీతిక, ఏజీఎం చేతన్ మాధుర్, ప్రిన్సిపాల్స్ టీఎల్ఎన్ శర్మ, రాజ్‌కుమార్ జోషి, ఏడుకొండలు, మురళీమోహన్, నీరజ, శ్రీదేవి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌పై నిఘా

కూసుమంచి, ఏప్రిల్ 6: పాలేరు రిజర్వాయర్ నుంచి నీటి చౌర్యం జరగకుండా మూడు శాఖల అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. రిజర్వాయర్ నీటి మట్టం క్రమంగా పెరుగుతూ శనివారం సాయంత్రానికి 15 అడుగులకు చేరుకుంది. సాగర్ నుంచి 5,247 క్యూసెక్కుల నీరు వచ్చింది. కాలువ ద్వారా పాలేరుకు వస్తున్న నీటిని మార్గమధ్యలో ఎక్కడా చోరీ చేయకుండా ఇరిగేషన్, పోలీస్, మిషన్ భగీరథ శాఖల అధికారులు నిఘా పెట్టారు.

'దళితబంధుతో దర్జాగా ఉన్నాం'

మాట్లాడుతున్న దళితబంధు లబ్ధిదారులు

కారేపల్లి, ఏప్రిల్ 6: బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన దళితబంధు సాయంతో తామంతా ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నామని, దర్జాగా ఉన్నామని మండలంలోని 21 మంది లబ్ధిదారులు చెప్పారు. వారు శనివారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. దళితబంధుపై కొందరు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. పప్పుల నిర్మల, చెవుల చందు, చినుముల విజయ్, తిప్పారపు వీరబాబు,ఎర్రబెల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

బయ్యన్నగూడెంలో క్రికెట్ టోర్నమెంట్

పెనుబల్లి, ఏప్రిల్ 6: మండల పరిధిలోని బయ్యన్నగూడెంలో ఆదివారం సింగిశాల చంటి- సింగిశాల ముక్కంటి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతి రూ.30,116, ద్వితీయ బహుమతి రూ.20,116 అందించనున్నట్లు పేర్కొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED
jobs Apply Now!
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

లీజుకు ఇవ్వబడును
1).గొల్లగూడెంలో కాలేజీలకు, స్కూలుకు ఉపయోగపడే ఒక ఎకరం ల్యాండ్ కాంపౌండ్, సోలార్ ఫెన్సింగ్‌తో లీజుకు ఇవ్వబడును. 2).ఇల్లందు మెయిన్‌రోడ్డు, జయనగర్, HP పెట్రోల్ బంక్ ఎదురుగా, 2000 గజాలు లీజుకు ఇవ్వబడును.
CELL: 9642097979

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సంక్షిప్తం

డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్ అందజేత

ఎర్రుపాలెం, ఏప్రిల్ 6: మండలంలో డీఎస్సీ అభ్యర్థులు 150 మందికి రూ.1.50 లక్షల విలువైన ఎస్ అండ్ ఎస్ పబ్లికేషన్ మెటీరియల్‌ను శనివారం స్థానిక ఎస్‌జేకేఎం కళాశాలలో జీఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు జంగా గురునాథరెడ్డి అందించారు. ఈ మెటీరియల్ కొనుగోలుకు వీఎస్కే కన్‌స్ట్రక్షన్స్ అధినేత వేజెండ్ల సాయికుమార్ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రంగారావు, కళాశాల అధినేత దండెం సత్యనారాయణరెడ్డి, ప్రతిభ స్కూల్ అధినేత సామినేని గిరి, సుదర్శన్ ఫౌండేషన్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

ముదిగొండ, ఏప్రిల్ 6: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో చలివేద్రాన్ని శనివారం ఎంపీడీవో శ్రీధరస్వామి ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నర్సింహారావు, ఎంపీవో సూర్యనారాయణ, కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 6: మండలంలోని పిండిప్రోలు, కాకరవాయిలో చలివేంద్రాలు ప్రారంభమయ్యాయి.

వైరా రూరల్, ఏప్రిల్ 6: మండలంలోని దాచాపురంలో శనివారం చలివేంద్రం ప్రారంభమైంది.

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 6; మండలంలోని ఏదులాపురం పంచాయితీ క్రాస్ రోడ్డు వద్ద చలివేంద్రాన్ని శనివారం ఎంపీడీవో ఎస్.కుమార్ ప్రారంభించారు.

ఎరువుల దుకాణం తనిఖీ

ముదిగొండ, ఏప్రిల్ 6: మండలంలోని గోకినేపల్లి గ్రామంలో ఎరువుల దుకాణాన్ని మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు శనివారం తనిఖీ చేశారు. ఏఈవో మౌనిక తదితరులు పాల్గొన్నారు.

భజన కళాకారుడు మృతి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 6: మండలంలోని పిండిప్రోలులో భజన, రంగస్థల కళాకారుడు గోకినపల్లి బజారయ్య(85) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. మృతదేహాన్ని వివిధ పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 6: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పిండిప్రోలుకు చెందిన ఐతనబోయిన వెంకటేశ్వర్లు శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్లేందుకు స్థానిక శివాలయం సమీపంలో రోడ్డు దాడుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఖమ్మం ఆస్పత్రిలో మృతిచెందాడు. ఆయనకు భార్య, పిల్లలు లేరు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

'స్పాట్' కేంద్రంలో ఇంగ్లిష్ టీచర్ల నిరసన

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6: పదో తరగతి మూల్యాంకనం జరుగుతున్న స్పాట్ కేంద్రంలో ఇంగ్లిష్ ఉపాధ్యాయులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఇంగ్లిష్ లాంగ్వేజెస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో వారు మాట్లాడుతూ.. నిరుటి వాల్యూయేషన్ రెమ్యూనరేషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు టీఏ, డీఏ, సీసీఎల్‌లను అందించాలని అన్నారు. డీఈవో సోమశేఖరశర్మ స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

9న బిషప్ అభిషేక మహోత్సవం

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 6: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు నూతన పీఠాధిపతిగా సగిలి ప్రకాశ్ నియమితులయ్యారని, ఈ నెల 9న అభిషేక మహోత్సవం జరుగుతుందని ప్రస్తుత పీఠాధిపతి ఉడుముల బాల తెలిపారు. ఆయన శనివారం మండలంలోని కరుణగిరి చర్చి ప్రాంగణంలో విలేకరులతో ఈ విషయం చెప్పారు.

నేడు సామూహిక సత్యాగ్రహం

కొణిజర్ల, ఏప్రిల్ 6: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఖమ్మం కొత్త కలెక్టరేట్ ఎదురుగాగల ధర్నా చౌక్‌లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సామూహిక సత్యాగ్రహం నిర్వహించనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వర్ణ సుబ్బారావు, గంధం పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఇది ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సత్యాగ్రహాన్ని పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు నల్లమోతు తిరుమలరావు ప్రారంభిస్తారని తెలిపారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన

మధిర, ఏప్రిల్ 6: ప్రకృతి విపత్తులపై స్థానిక శ్రీనిధి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రంగారావు (హెచ్‌ఓడీ) శనివారం అవగాహన కల్పించారు. మధిర సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం విద్యాలత, ఎంఈవో ప్రభాకర్, విశ్రాంత అధ్యాపకుడు సముద్రాల లక్ష్మీపతి, అధ్యాపకులు ఉమామహేశ్వరరావు, వెంకటనారాయణ, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ చైతన్య సదస్సు

మధిర, ఏప్రిల్ 6: వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రం-2 ఆవరణలో శనివారం న్యాయ చైతన్య సదస్సు జరిగింది. చట్టాలపై జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్‌రెడ్డి అవగాహన కల్పించారు. వైద్యులు పృథ్వి, వెంకట్‌లాల్, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వైరా రూరల్, ఏప్రిల్ 6: మండలంలోని పాలడుగు పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని కొణిజర్ల మండలం తనికెళ్లలోని గ్రేస్ జనరల్ హాస్పిటల్ యాజమాన్యం నిర్వహించింది. పాస్టర్ మోదుగు వినోద్‌కుమార్ సహకారంతో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో వనమా చిన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

వైరా టౌన్, ఏప్రిల్ 6: తలసేమియా బాధిత పిల్లల సహాయార్థం ఆదివారం స్థానిక కామివెట్టి కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు మార్పు స్వచ్ఛంద సంస్థ బాధ్యులు గుడిమెట్ల రజిత, మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

రఘునాథపాలెం, ఏప్రిల్ 6: ఖమ్మం నగరానికి చెందిన కేబీకే మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మై పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం పాండురంగాపురంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మై పీపుల్ వెల్ఫేర్ సంస్థ అధ్యక్షురాలు మాదిరెడ్డి శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పల్లా సుశీలమ్మకు నివాళి

రఘునాథపాలెం, ఏప్రిల్ 6: బీఆర్ఎస్ నాయకుడు పల్లా కిరణ్ మాతృమూర్తి పల్లా సుశీలమ్మ అనారోగ్యం కారణంగా శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కేఎంసీ మేయర్ పునకొల్లు నీరజ.. వెంటనే ఖమ్మంలోని వారి స్వగృహానికి వెళ్లారు. సుశీలమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు మేయర్ వెంట భర్త రామబ్రహ్మం ఉన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 6: కార్మికులకు, వారి కుటుంబాలకు ట్రాలీ అసోసియేషన్ అండగా ఉంటుందని బీఆర్ఎస్‌కేవీ నాయకుడు నున్నా మాధవరావు భరోసా ఇచ్చారు. ఖమ్మం ఏఎంసీ ట్రాలీ అసోసియేషన్‌లోని ఎంఎన్ఆర్ ముఠా కార్మికుడు వెంకటనారాయణ అనారోగ్యం కారణంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాధవరావు.. శనివారం మృతుడి స్వగృహానికి వెళ్లి అతడి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు అసోసియేషన్ తరపున రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

పెనుబల్లి ముత్యాలమ్మ గుడిలో చోరీ

పెనుబల్లి, ఏప్రిల్ 6: పెనుబల్లి ముత్యాలమ్మగుడిలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకు పాల్పడ్డారు. గుడి తలుపు తాళాలు పగులగొట్టి చోరీకు పాల్పడ్డారు. ఆలయంలో హుండీలు, బీరువాను పగులగొట్టి కానుకలను దొంగిలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'తలసేమియా చిన్నారులకు బోన్‌మ్యారో చికిత్స చేయిస్తాం'

ఖమ్మం సిటీ, మార్చి 06: తలసేమియా బాధిత చిన్నారులకు బోన్‌మ్యారో చికిత్సను ఉచితంగా చేయిస్తామని వికాస తరంగిణి బాధ్యుడు పోలాస్ శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మంలోని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో తలసేమియా చిన్నారుల కోసం సంకల్ప సంస్థ 14 ఏళ్లుగా పరితపిస్తూ అందిస్తున్న సేవలు అభినందనీయమైనవని అన్నారు. ఏటా ఒక చిన్నారికి బోన్‌మ్యారో చికిత్స నిమిత్తం అయ్యే ఖర్చును ఇకనుంచి తమ సంస్థ భరిస్తుందని తెలిపారు. డే కేర్ సెంటర్‌లో రక్తం ఎక్కించుకునే వారందరికీ అన్నదానం చేస్తామన్నారు. వైద్యులు జితేందర్, నారాయణమూర్తి, సంస్థ బాధ్యులు పావని, ప్రొద్దుటూరి రవిచందర్, అనిత, శాంతి తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 6: నగర టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధిత మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. టూ వీలర్ మెకానిక్ ఎస్‌కే నాగుల్‌మీరాకు గత నెలలో కంటి ఆపరేషన్ జరిగింది. దీంతో సదరు మెకానిక్ పనిచేసే అవకాశం లేకపోయింది. దీంతో విషయం తెలుసుకున్న యూనియన్ నాయకులు.. నాగుల్‌మీరా ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరపున రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. సంఘం నాయకులు వంగాల కొండల్‌రావు, శ్రీను, మురళి, రమేశ్, హరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'కూరపాటి'తో ఎంపీలు నామా, వద్దిరాజు భేటీ

మామిళ్లగూడెం, ఏప్రిల్ 6: టీడీపీ రాష్ట్ర నాయకుడు కూరపాటి వెంకటేశ్వర్లును ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శనివారం ఖమ్మంలోని ఆయన నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. నామా నాగేశ్వరరావు, కూరపాటి వెంకటేశ్వర్లు గతంలో ఒకేపార్టీలో ఉన్నప్పుడు ఆయా ఆందోళనల్లో ఇద్దరూ కలిసి పాల్గొన్న విషయాలను గుర్తుచేసుకున్నారు.

ఇంటూరి శేఖర్‌కు నామా పరామర్శ

బీఆర్ఎస్ నాయకుడు ఇంటూరి శేఖర్‌ను ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు. ఖమ్మంలోని శేఖర్ నివాసానికి శనివారం వెళ్లిన నామా, వద్దిరాజు.. పలు విషయాల గురించి చర్చించారు. బీఆర్ఎస్ నాయకులు, నామా సేవా సమితి బాధ్యులు మలీదు వెంకన్న, మోరంపూడి ప్రసాద్, రాజేశ్, చీకటి రాంబాబు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులను వదలొద్దు..

మల్టీజోన్-1 ఐజీపీ ఏవీ రంగనాథ్

రఘునాథపాలెం, ఏప్రిల్ 6 : నగరంలో భూ ఆక్రమణ దందాలు చేస్తూ బాధితులను బెదిరించి దౌర్జన్యాలు, దాడులకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని, కబ్జాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించొద్దని మల్టీజోన్-1 ఐజీపీ ఆవుల వెంకటరంగనాథ్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లాకు వచ్చిన ఆయన పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి ఖానాపురం హవేలి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను నిశితంగా పరిశీలించిన ఆయన సమస్యల పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్లలో ఇటీవల ఫిర్యాదు చేసిన బాధిత ఫిర్యాదుదారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్ అధికారులు స్పందించిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రిమినల్ చర్యలున్నా.. సివిల్ కేసులని వదిలేస్తే కబ్జాలు, దాడులు, దౌర్జన్యాలు పెరిగే అవకాశం ఉంటుందనే విషయాన్ని పోలీస్ అధికారులు గుర్తించి అప్రమత్తంగా ఉండాలన్నారు. సామాన్యులకు న్యాయం జరిగినప్పుడే సమస్యలున్న ప్రజలు సైతం నిర్భయంగా ఠాణాకు వచ్చి ఫిర్యాదులు చేస్తారన్నారు. ప్రధానంగా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కేసుల విషయంలో తాత్సారం చేయొద్దని, విధి నిర్వహణలో రోల్ క్లారిటీ ఉండాలని ఆయన సూచించారు. ఏసీపీలు అవినాశ్ కుమార్, మౌనిక, టౌన్ ఏసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మామూలు స్థితికి..

రఘునాథపాలెం, ఏప్రిల్ 6: మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి తప్పిపోయిన ఓ వ్యక్తిని చేరదీసిన అన్నం సేవా ఫౌండేషన్ బాధ్యుడు అన్నం శ్రీనివాసరావు.. 12 ఏళ్లు సపర్యలు చేసి అతడిని మామూలు స్థితికి తీసుకొచ్చారు. తాజాగా అతడిని అతడి కుటుంబ సభ్యులకు చెంతకు చేర్చాడు. శ్రీనివాసరావు కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన 40 ఏళ్ల మాన్‌సింగ్ అనే వ్యక్తి మతిస్థిమితం కోల్పోయాడు. ఎనిమిదేళ్ల క్రితం ఖమ్మంలో సంచరిస్తూ ఇక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుండేవాడు. స్థానికుల సమాచారం మేరకు అతడిని చేరదీసిన అన్నం సేవా ఫౌండేషన్ బాధ్యుడు అన్నం శ్రీనివాసరావు.. అతడిని తన ఆశ్రమంలో ఉంచి ఇన్నాళ్లూ సపర్యలు చేశాడు. వైద్య సేవలు అందించాడు. ఇటీవల అతడి మానసిక పరిస్థితి మామూలు స్థితికి చేరుకొని తన కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేశాడు. దీంతో అన్నం శ్రీనివాసరావు ఒడిశా పోలీసుల సహాయంతో ఇటీవల అతడిని అతడి కుటుంబ సభ్యులకు అప్పగించాడు. దీంతో మాన్‌సింగ్ కుటుంబ సభ్యులందరూ కలిసి అన్నం శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.